# విపశ్యన మాసపత్రిక

VOLUME:37 NO - 28 1 July 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


**"ధర్మవాణి"**

*అభిత్థరేథ కల్యాణే, పాపా చిత్తమ్ నివారయే;*

*దన్ధమ్ హి కరోతో పుఞ్ఞమ్, పాపస్మిమ్ రమతీ మనొ.*

*- ధమ్మపద - 116,*

మంచిని ఆచరించడానికి మనిషి తాపత్రయపడాలి.
అలాగే తన మనసుని చెడు నుంచి నిరోధించాలి.
ఎవరి మనసు మంచిని ఆచరించడానికి మందకొడిగా ఉంటుందో
వారి మనసు చెడుని ఆస్వాదించడానికే సుముఖత చూపుతుంది.

# పూజ్య గురూజీ భారతదేశానికి వచ్చిన తరువాత ఎదురైన అనుభవాలు

పూజ్య గురూజీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధధర్మ సంపర్కంలోకి రావటం నుండి మొదలుకుని వారి ప్రారంభిక జీవితానికి సంబంధించిన అనేక వ్యాసాలు ముద్రింపబడ్డాయి. ఆయన భారతదేశానికి వచ్చి, విపశ్యన బోధన ప్రారంభించిన తరువాత ఎదుర్కొన్న అనుభవాలు మరియు ఆయన బోధించిన శిక్షణను ఇప్పుడు ప్రకాశింపచేస్తున్నాము. ఈ క్రమంలోనే - గోయంకా గారు రచించిన హిందీ పుస్తకం **ఆత్మకథన్ భాగ్ 2** యొక్క **పన్నెండవ** భాగాన్ని సమర్పిస్తున్నాము.

## బౌద్ధ ధర్మానికి దూరంగా ఉండటం

**"విపశ్యన నిజంగానే అందరికీ హితవు చేకూర్చే విద్య. ఈ సాధనాభ్యాసంతో నాలాంటి ఎంతోమంది ప్రయోజనం పొందారు, పొందుతున్నారు. అయినప్పటికీ మా సమాజంలోని ఎంతోమది ప్రజలు దీనిని "బౌద్ధ ధర్మం"గా భావించి దీని నుండి దూరంగా ఉంటున్నారు. అంతేకాక వారు నాతో, "ఒకవేళ మీరు మీ ప్రవచనాలలో బుద్ధుని పేరును ప్రస్తావించకుంటే, ఎంతోమంది ప్రజలు ఎటువంటి సంశయం లేకుండా ఈ విద్యను స్వీకరిస్తారు, పాపం వారందరికీ శుభం కలుగుతుంది కదా." అని వారి వారి అభిప్రాయాలు వెలిబుచ్చేవారు.**

భారతదేశానికి వచ్చి విపశ్యన సాధనా శిబిరాలు నిర్వహించటం మొదలుపెట్టినప్పటి నుండి ఎంతోమంది సాధకుల ఈ రకమైన అభిప్రాయాలు వింటూ వస్తున్నాను. వారి మాటల్లోని సత్యాన్ని, వారి సదుద్దేశాన్ని అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఎవరో ఎందుకు, మా బంధువులే కొందరు ఈ కారణం చేతనే ఇప్పటికీ విపశ్యన శిబిరాలకు దూరంగా ఉన్నారు. ఈ విద్యతో ఇతరులు ప్రయోజనం పొందటాన్ని చూశాక కూడా దీనిని "బౌద్ధ ధర్మం"గా భావించి దీని నుండి దూరంగా ఉంటున్నారు.

అప్పుడున్న పరిస్థితుల్లో బుద్ధ భగవానుని పేరుని తొలగించి ప్రజలను మభ్యపెట్టటం నాకెంతో సులభమైన పని. అప్పటికింకా భారతదేశంలో "విపశ్యన" పదం కూడా ప్రచారం కాలేదు, సామాన్య ప్రజలకైతే ఇది బుద్ధ భగవానుడు నేర్పించిన విద్య అని కూడా తెలియదు. కాబట్టి బుద్ధుని పేరును పక్కన పెట్టి ఈ పేరుతోనే శిబిరాలను నిర్వహించగలిగేవాడిని. లేక నిజాన్ని దాచటానికి ఇంకేదైనా పర్యాయపదాన్ని వాడుకోగలిగే వాడిని. దేశంలోని వివిధ సమాజాలలోని ప్రజలను పెద్ద సంఖ్యలో ఆకర్షించటానికి దీనికి 'గీత' లేదా 'పతంజలీ యోగా' పేర్లు పెట్టి నేర్పించటం మొదలుపెట్టేవాడినే. ఇలా ప్రజలను ఎన్నో రకాలుగా మభ్యపెట్టగల పరిస్థితి ఉన్నప్పటికీ, అలా చేయటం ఘోరమైన విశ్వాసఘాతుకం అవుతుంది. ఎవరి నుండి నేను ఈ విద్యను నేర్చుకుని నాకై నేను మంగళం చేకుర్చుకున్నానో, ఆ మా గురుదేవులు సయాజీ ఊ బా ఖిన్ గారి పట్ల కృతఘ్నుత. బర్మాదేశం పట్ల మరియు - రెండు, రెండున్నర వేల సంవత్సరాల నుండీ గురు-శిష్య పరంపర ద్వారా ఈ శుభకరమైన విద్యను శుద్ధరూపంలో కాపాడి ఉంచిన అక్కడి సత్పురుషుల పట్ల కృతఘ్నుడినవుతాను, ఈ విద్యను వెతికి వెలికితీసి కేవలం ఆయనకే కాకుండా అనేకులకు మేలు చేకూర్చిన బుద్ధ భగవానుని పట్ల కృతఘ్నుడినవుతాను.

కృతఘ్నుత అనే ఈ నీచమైన పాపానికి ప్రాయశ్చిత్తంగా నాకు ఏ రకమైన దేహదండనకు కానీ, పశ్చాత్తాపంగా జన్మ-జన్మల వరకూ మనస్తాపంతో బాధపడటానికి కానీ నేను సిద్ధంగాలేను. కాబట్టే నేను అధిక సంఖ్యలో సాధకులను కూడబెట్టుకోవాలనే మిథ్యాలోభాన్ని మనసులోనే తలెత్తనివ్వలేదు. అది మంచిదే అయింది.

నేను బుద్ధుని పేరుతోనే ధర్మాన్ని నేర్పించాను. నేను సత్యాన్ని ఆశ్రయించి మిథ్యా ఆలంబనను దూరంగా ఉంచాను. ధర్మాన్ని ఆశ్రయించి అధర్మం నుండి తప్పించుకున్నాను. కృతజ్ఞతను ఆశ్రయించి కృతఘ్నుత నుండి నన్ను నేను కాపాడుకోగలిగాను.

దానితో మంచి ఫలితాలే వచ్చాయి. పూర్వ పారమితలు సమృద్ధిగా కలిగిన భారతదేశ ప్రజలు ఎంతోమంది, సమాజంలోని మానవీయ పెద్దలు ఎంతోమంది, ఈ విపశ్యనను సహర్షంగా స్వీకరించారు, అలాగే వారిలో అనేకులు అత్యంత నిస్వార్థభావంతో, నిండు మనసుతో దీనిని వ్యాపింపచేసే పనిలో జతకలిశారు. అయినప్పటికీ భారతదేశంలోని ఎంతోమంది ప్రజలు ఇప్పటికీ "బౌద్ధధర్మం" అంటూ దీని నుండి ముఖం చాటేస్తున్నారు. కొందరైతే దీని ప్రయోజనాలను అర్థం చేసుకుంటూ కూడా దీనిని పరధర్మంగా భావిస్తూ దీని నుండి దూరంగా పారిపోతున్నారు.

ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, వీరందరూ బుద్ధుడిని గౌరవిస్తారు, ఆయనను తమ ఈశ్వరుని అవతారంగా చెప్పుకుని పూజ్యులుగా భావిస్తారు. కానీ వారి మంగళకర బోధనను మాత్రం "బౌద్ధధర్మం" గా పిలుస్తూ దాని నుండి దూరంగా పారిపోతారు. ఈ పరస్పర విరుద్ధ ద్వంద్వ మానసికతకు కారణమేమిటి? ఒకవైపు బుద్ధుడిని మహాత్ముడిగా నమ్మి వారిని గౌరవిస్తారు, మరోవైపు వారు బోధించిన బోధననే హీనంగా భావించి దానిని తిరస్కరిస్తారు. అసలు దీనికి గల కారణమేమిటో, దాని రహస్యమేమిటో, అర్థం చేసుకోవలసిన అవసరముంది.

## వివాదం ఎదురైన మొదటి సందర్భం :

విపశ్యనతో సంపర్కంలోకి రాకముందు మయన్మార్‌లో ఉండగా, ఒకవైపు బుద్ధ భగవానుని గౌరవించటం, మరోవైపు వారి బోధనలను నిరాకరించటం వంటి ద్వంద్వ మనస్తత్వాన్ని స్వయంగా నాకు నేనుగా కూడా అనుభవించాను. కానీ భారతదేశానికి వచ్చాక, దాదాపుగా దేశ ప్రజలందరూ ఇటువంటి హాస్యాస్పద, పరస్పర విరోధమైన మానసికతలో మునిగి ఉన్నారు అని గమనించాను. ఇక్కడ మొట్టమొదటిసారి ఈ పరస్పర విరుద్ధ అభిప్రాయాలు గల వ్యక్తిని నేను ఇక్కడికి వచ్చిన మొదటి సంవత్సరంలో బుద్ధగయాలో శిబిరాన్ని నిర్వహిస్తున్న సమయంలో ఎదుర్కొన్నాను. గయా నగరానికి చెందిన ఒక వ్యక్తి, సమన్వయ ఆశ్రమంలో నన్ను కలవటానికి వచ్చి, కొద్దిసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడిన తరువాత ఆయన –

"మీరు, మా సమాజానికి చెందినవారై ఉండి, "బౌద్ధధర్మాన్ని" ఎందుకు ప్రచారం చేస్తున్నారు? అది అణగారిన వర్గాల ధర్మం కదా. అది మీకు మంచిది కాదు." అని చెప్పాడు.

నేను వారికి కానీ, లేక బౌద్ధధర్మం పేరుతో సందేహించే ఇతరులకు కానీ ఏమని నచ్చజెప్పను? "బుద్ధ భగవానుడు బోధించిన బోధనలనే నేను నేర్పిస్తున్నాను కానీ "బౌద్ధధర్మాన్ని" కాదు. ఈ బౌద్ధధర్మమనే పదం ఎప్పటినుండి మొదలయిందో, దానిని ఎవరు ప్రచారం చేశారో నాకయితే తెలియదు. దీనిని బౌద్ధ ధర్మమని అంటే అది కేవలం బౌద్ధ మతస్థులకే చెందుతుంది. కానీ బుద్ధ భగవానుడు, ఏ ఒక్క సముదాయం కొరకో ధర్మాన్ని బోధించలేదు. ఆయన ధర్మాన్ని బోధించాడు, ధర్మం అందరికీ చెందినది. ఆయన తన బోధనలకెప్పుడూ "బౌద్ధధర్మం" అనే పదాన్ని ప్రయోగించనే లేదు. దానిని కేవలం **ధమ్మ** అనగా ధర్మం అనే పిలిచాడు, ఆ బోధనలను పాటించేవారిని కూడా "బౌద్ధులు" అని పిలవలేదు, వారిని **ధమ్మికో** అంటే ధార్మికులు అనే పిలిచారు. ధర్మాన్ని ప్రతిఒక్కరూ నేర్చుకోగలరు, ప్రతిఒక్కరూ నేర్చుకోవాలి కూడా. ప్రతిఒక్కరూ ధార్మికులు కాగలరు. ప్రతిఒక్కరూ తప్పకుండా ధార్మికులు కావాలి. కానీ నా ఈ మాటలు పూర్తిగా సత్యమే అయినప్పటికీ ఆ ప్రారంభిక రోజుల్లో దానిని అర్థం చేసుకునేవారెవరు, అంగీకరించేవారెవరు? ఇప్పుడైతే సంపూర్ణ బుద్ధవాణియే కాకుండా, పాళీ భాషలో వాటి మీద రాయబడిన భాష్యాలు, టీకాలు, అనుటీకాలకు చెందిన 140 గ్రంథాలు విపశ్యన పరిశోధనా సంస్థ ద్వారా CD-ROM లలో భద్రపరచబడ్డాయి. వాటిలో పదాలను వెదకగలిగే సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఆ విశాల సాహిత్యంలో "బౌద్ధులు" లేక "బౌద్ధధర్మము" అనే పదాలు ఈ అర్థాల్లో ఒక్కసారి కూడా ప్రయోగించినట్లు మనకు అగుపించదు. అందువలన ఆ సమయంలో నేను వారికి – "బుద్ధ భగవానుడు మహా కరుణామయుడు, ఆయన అందరికీ ధర్మాన్ని నేర్పించాడు, ఒకవ్యక్తి ఏ జాతి, గోత్రం మరియు వర్ణానికి చెందిన వాడైనా సరే, ఆయన బోధించిన బోధనలతో అందరూ లాభం పొందారు నేను కూడా పొందుతున్నాను. వారి మంగళకరమైన బోధనలతో నేను స్వయంగా లాభం పొందాను. నా కుటుంబము మరియు సమాజానికి చెందిన ఇతరులు ఎంతోమంది మయన్మార్‌లో లాభం పొందారు. అందుకే దానిని అందరికీ పంచటానికి భారతదేశానికి వచ్చాను. నీవు కూడా అనుభూతితో చూడు." అని మాత్రమే చెప్పి ఊరుకున్నాను.

సమాధానంగా ఆయన, "అవును నిజమే, బుద్ధుడు మహాత్ముడే. కానీ వారి ధర్మాన్ని మాత్రం కేవలం అణగారిన వర్గాలే స్వీకరించాయి." అని చెప్పాడు.

కానీ ఆ వ్యక్తి, బుద్ధ భగవానుని ప్రశంశిస్తూ అక్కడ సమీపంలోని ప్రసిద్ధ బుద్ధ మందిరంలో సాష్టాంగ నమస్కారం చేసేవాడు, శ్రద్ధతో పూలు సమర్పించేవాడు. నేను చెబితే కొద్దిసేపు ఆనాపాన సాధన కూడా ప్రయత్నం చేసేవాడు. మనసు అంగీకరించకపోయినా ఒకసారి శిబిరంలో కూడా కూర్చున్నాడు. కానీ అప్పుడప్పుడూ భారతదేశంలోని బౌద్ధమతస్థుల పట్ల, మరియు బౌద్ధధర్మం పట్ల మళ్ళీ అదే విషాన్ని వెలగక్కేవాడు, ఏదో ఒక చెడు మాట మాట్లాడేవాడు. అతడిని ఏమని వారించను? కాబట్టి ఈ విషయంలో చర్చకు తావివ్వకపోవటమే మంచిదని భావించి ముందుకు సాగాను.

## ద్వంద్వ మనోస్థితి :

బుద్ధుని బోధనలు అణగారిన వర్గాల ధర్మం అని ఎందుకు నిందించబడింది అన్నది కాదు ప్రశ్న. ఆయన బోధనలను వ్యతిరేకించే వ్యక్తి కూడా బుద్ధుడిని నమస్కరిస్తాడు. ఎక్కువ శాతం మందిలో ఇలాంటి ద్వంద్వ మనోస్థితియే ఉన్నది – ఒకవైపు "బుద్ధుడి గొప్పతనాన్ని స్తుతిస్తారు, మరోవైపు బుద్ధుని బోధనలను "బౌద్ధధర్మం" అని చెప్పి వాటిని నిందిస్తారు.

ఇలాంటి ద్వంద్వ మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు తారాసపడినప్పుడు నాకు వారిపట్ల ఎంతమాత్రం చెడు తలంపు కలిగేది కాదు. వారి తెలియనితనం పట్ల నాలో కరుణనే ఉదయించేది. ఎందుకంటే నాకు ముప్పై ఒక్క సంవత్సరాల వయసు వచ్చేంత వరకూ స్వయంగా నేను కూడా ఈ ద్వంద్వ మనోస్థితిలోనే చిక్కుకుని ఉన్నాను. ముప్పైరెండు సంవత్సరాల వయసులో నా మొదటి విపశ్యన శిబిరం పూర్తి చేసుకున్నాక, ఈ పరస్పర విరుద్ధ ద్వంద్వ చింతనలో ఖచ్చితంగా ఏదో తప్పిదముంది అని నాకు మొదటిసారి అనిపించింది. కాబట్టే ఈ దూషిత చింతనకు అసలైన కారణాన్ని అన్వేషించటం మొదలుపెట్టాను. నా జీవితంలో ఇలాంటి తర్కరహితమైన, అసంగతమైన, ద్వంద్వ మనోస్థితిని కలిగించే సంఘటనలు ఏవి జరిగాయి, ఏ విధంగా అవి రోజురోజుకూ మరింత బలపడుతూపోయాయి అని ఆలోచించి, నా గతాన్ని పునరావలోకనం చేసుకుని వాస్తవ సత్యాన్ని అన్వేషించటం ప్రారంభించాను.

## బుద్ధుని బోధనలు నిషేధాత్మకమైనవి కావు

మూల బుద్ధవాణి మరియు విపశ్యన సాధనలు అందుబాటులో లేకపోవటంతో, "బుద్ధుని బోధనలు నిషేధాత్మకమైనవి" అనే ఒక భ్రాంతి, ఒక అపోహ వ్యాప్తి చెందింది. దానితో దేశంలోని అగ్రశ్రేణి పండితులు కూడా భ్రాంతికి గురయ్యారు. ఇక సాధారణ ప్రజల గురించి ఏమని చెప్పాలి? బుద్ధ భగవానుని పరమ ప్రశంసకుడైన పూజ్య స్వామీ వివేకానంద గారు కూడా, "బుద్ధుని బోధనలు నిషేధాత్మకమైనవి" అని చెప్పారు. ఇంకా

"ధర్మం విధేయాత్మక విషయము, నిషేధాత్మక ప్రలాపం కాదు." మరియు

**"ఏదైనా ధర్మం నిషేధాత్మక పక్షానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తే, చివరికి అది అంతమైపోయే ప్రమాదం కూడా ఉంటుంది. కేవలం నిర్మాణాత్మక తత్వాలే నిలిచి ఉంటాయి. కాబట్టి విధేయాత్మక పక్షానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి."**

విపశ్యన సాధనా సంపర్కంలోకి రాకముందు విద్వాంసుల ఈ అభిప్రాయాలను చదువుతూ, వింటూ స్వయంగా నేనే ఈ విషయంలో ఎంతగానో భ్రమకు లోనయ్యాను. దానితో, "బుద్ధ భగవానుడు ఈ నిషేధాత్మక బోధనకే ఎందుకింత ప్రాధాన్యతనిచ్చాడు? సత్–చిత్–ఆనందపు విధేయాత్మక దృష్టికోణాన్ని విడిచిపెట్టి అనిత్యము, దుఃఖము, అనాత్మలకు ఎందుకింత ప్రాముఖ్యతనిచ్చాడు? సత్యం వద అనే విధేయాత్మక బోధననివ్వకుండా అబద్ధాలు చెప్పకూడదు అనే

నిషేధాత్మక బోధననెందుకిచ్చాడు?" అని ఆలోచించేవాడిని. కాబట్టే భగవానుని బోధనలను మన సనాతన బోధనలతో పోల్చి చూసి దానిని తక్కువగా భావించేవాడిని. కానీ విపశ్యన సాధనాభ్యాసం మరియు భగవానుని మూలవాణి యొక్క అధ్యయనాలు నా కళ్ళు తెరిపించాయి.

బుద్ధుడు, నిషేధాత్మకమైన మరియు విధేయాత్మకమైన (ఆచరణాత్మకమైన), రెండు రకాల బోధనలనూ బోధించాడు.

***"సబ్బ పాపస్స అకరణం"***

– ఏ విధమైన పాపకర్మలూ చేయకుండుట. ఇది నిషేధాత్మకమైనది,

***"కుసలస్స ఉపసమ్పదా"***

– కుశల కర్మలు పెంపొందించుకొనుట. ఇది విధేయాత్మకమైనది మరియు

***"సచిత్త పరియోదపన"***

– చిత్తాన్ని పూర్తిగా నిర్మలపరుచుకోవటం. ఇది కూడా విధేయాత్మకమైనదే.

మరి బుద్ధుని బోధనలు కేవలం నిషేధాత్మకమైనవే అని ఎలా అనగలం చెప్పండి? బుద్ధుని బోధనలలో విధి మరియు నిషేధం రెండు భాగాలూ బోధించబడ్డాయి.

## ధర్మం మరియు వినయం

2600 సంవత్సరాల క్రితం ఉత్తరభారత జనభాషలో ధర్మం అనే పదానికి ఎన్నో అర్థాలుండేవి. వాటిలో ఒకటి – "కరణీయం" అనగా కర్తవ్యము, చేయదగినది. ఈ అర్థం ఈరోజు కూడా వాడుకలో ఉంది. ఆ రోజుల్లో ధర్మానికి మరొక అర్థం ఉండేది – "చిత్తవృత్తి". ఈ అర్థం ఇప్పుడు వాడుకలో లేదు.

అదే విధంగా మరొక పదం "వినయము" – ఈ పదానికి నేడు – "అణకువ (నమ్రత కలిగి ఉండడం)" అనే అర్థం వాడుకలో ఉంది. "వినయపూర్వకంగా" అని అంటే "అణకువతో" అనే అర్థం వస్తుంది. అలాగే వినయమంటే – స్తుతి, వందన అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు – "ఈశ్వర వినయం". కానీ ఆ రోజుల్లో "వినయము" అనే పదానికి ఈ అర్థం ఉండేది కాదు. ఆ రోజుల్లో వినయము అనే పదాన్ని ''దూరం చేయటం'' అనే అర్థంలో ఉపయోగించేవారు. ఉదాహరణకు – ***"వినెయ్య లోకే అభిజ్ఝా దోమనస్సం"*** – లోకం పట్ల ఉన్న రాగ, ద్వేషాలను దూరం చేస్తూ.

అలా ధర్మం అంటే "కర్తవ్యం", లేక "కరణీయం", దానికి వ్యతిరేకమైన "వినయము" అంటే "అకరణీయం" అనే అర్థాలు వాడుకలో ఉండేవి.

భగవానుని బోధనలలో ***"ధమ్మ"*** మరియు ***"వినయ"***, అనగా "కరణీయం" అంటే ఆచరణయోగ్యమైన మరియు "అకరణీయం" అంటే ఆచరణయోగం కానటువంటి అనే రెండు పక్షాల గురించి తగిన విధంగా ప్రస్తావించబడింది.

***"అయం ధమ్మో అయం వినయొ ఇదం సత్థుసాసనం"*** – ఇది ధర్మం, ఇది వినయం, ఇదే శిక్షకుని బోధన. అంటే, ఇది కరణీయం (చేయదగినది), ఇది అకరణీయం (చేయకూడనిది). ఇదే బుద్ధుని బోధన.

అందువల్లనే, భగవానుడిని ధమ్మవాదీ మరియు వినయవాదీ అనే రెండు పేర్లతోనూ పిలిచేవారు. అంటే, "ధర్మం మరియు వినయం రెండింటినీ స్పష్టపరిచేవాడు" అని అర్థం. "కుశల ధర్మాల కరణీయత మరియు అకుశల ధర్మాల అకరణీయత" – ఆ మహాపురుషుడి బోధనలో ఈ రెండూ ఉన్నాయి. అందుకే –

***"అకుసలానం ధమ్మానం వినయాయ ధమ్మం దేసేమి"*** – అకుశల ధర్మాలు, అనగా దూషిత చిత్తవృత్తుల "వినయం కొరకు", అనగా వాటిని తొలగించుకోవటానికి ధర్మాన్ని నేర్పిస్తున్నాను. అలాగే,

***"అభిఞ్ఞాయ సమణో గోతమో ధమ్మం దేసేతి"*** – శ్రమణ గౌతముడు అభిజ్ఞానం కొరకు ధర్మాన్ని బోధిస్తాడు. అని చెప్పబడింది.

## ఆదరణీయ మహాకశ్యపుడు

బుద్ధ భగవానుడు మహాపరినిర్వాణం పొందిన 3 నెలల తరువాత, ఆదరణీయ మహాకశ్యపుడు సత్య సాక్షులైన (అరహంతులైన) 500 మంది భిక్షువులతో ప్రథమ సంగాయనాన్ని నిర్వహించాడు. దాని ఉద్దేశ్యం ఏమిటంటే, బుద్ధవాణినంతటినీ ప్రామాణ్యపరచి పొందుపరచటం. కాబట్టే –

***"హన్ద మయ్హ, ఆవుసో, ధమ్మం చ వినయం చ సంగాయెయ్యామ॥ "***

– ఓ ఆయుష్మంతులారా, మనం ధర్మాన్ని మరియు వినయాన్ని సంగాయనం చేస్తే బాగుంటుంది.

***"దుగ్గహితం దుగ్గహితతో ధారెత్వా॥"*** దుర్ గ్రహితాన్ని దుర్ గ్రహితం (చెడుని చెడుది) అని తెలుసుకుని,

***"సుగ్గహితం సుగ్గహితతో ధారెత్వా । "*** సుగ్రహితాన్ని సుగ్రహితం (మంచిదానిని మంచిది) అని తెలుసుకుని,

***"యో ధమ్మో, యో వినయో సుభాసితబ్బో । "***

– ఇది ధర్మం, ఇది గ్రహించదగినది, మరియు ఇది "వినయం", అంటే గ్రహించదగినది కాదు. అని దీనిని చక్కగా అర్థం చేసుకోవటం మంచిది అని చెప్పబడింది.

భగవానుని వాణిలో "ధర్మం" మరియు "వినయం" రెండింటి ప్రస్తావనా ఉంది. కొన్ని కొన్ని చోట్ల ఒకే వాక్యంలో రెండూ మిళితమై ఉంటాయి. ఉదాహరణకు –

***"అసేవనా చ బాలానం।"*** – మూర్ఖులతో సాంగత్యం చేయకూడదు మరియు

***"పణ్డితానఞ్చ సేవనా । "*** – జ్ఞానులతో సాంగత్యం చేయాలి అనే బోధన. రెండూ కలిసే ఉన్నాయి. – ఖుద్దకపాఠము 5.3

నిషేధాత్మకము మరియు విధేయాత్మకము. రెండూ ఒకటేచోట ఉన్నాయి. అత్యంత సరళమైన ప్రజలభాషలో బోధించిన బుద్ధుని బోధనలను ఆయన శిష్యులు చక్కగా అర్థం చేసుకునేవారు. కాబట్టే సాధకులైన వారి శిష్యులు

***"ఆరద్ధవీరియో విహరతి అకుసలానం ధమ్మానం పహానాయ కుసలానం ధమ్మానం ఉపసమ్పదాయ॥"*** –దీఘనికాయ 3.317

– అకుశల చిత్తవృత్తులను దూరం చేసుకోవటానికి మరియు కుశల చిత్తవృత్తులను కలిగించుకోవటానికి నిరంతర సాధన కొనసాగించేవారు.

## అక్రియావాది

బుద్ధ భగవానుడు, ఎప్పుడూ ఎవరితోనూ వివాదానికి తావివ్వలేదు. ఆయనకి వివాదాల పట్ల ఎటువంటి ఆసక్తి లేకున్నది. అయితే ఎన్నోసార్లు, ఎంతోమంది వారి వద్దకు వివాదానికి వస్తుండేవారు. అప్పుడు ఆయన మిక్కిలి శాంత చిత్తంతో వారి వాదనలను వివాదరహితం చేసేసేవాడు. అప్పుడప్పుడూ ఎవరో ఒకరు, ఆయనపై మోపబడిన ఫలానా ఆక్షేపణ నిజమా, అబద్ధమా అని వినమ్రంగా అడగటానికి కూడా వచ్చేవారు. అలానే ఒక జిజ్ఞాసి, "కొంతమంది మిమ్మల్ని అక్రియావాదులుగా భావిస్తున్నారు. అది నిజమేనా?" అని భగవానుని అడగటానికి వచ్చాడు. ఆ కాలపు భాషలో అక్రియావాదీ అనేది ఒక నిందనీయ పదము. కర్మవాద సిద్ధాంతాలను నమ్మని వారిని "అకర్మవాదీ" లేదా "అక్రియావాదీ" అని పిలిచేవారు.

భగవానుడు తనపై మోపబడిన నిందను స్వీకరించి, ఆ ప్రశ్నించిన వ్యక్తికి సమగ్రంగా సమాధానమిస్తూ –

"అవును, నేను క్రియావాదినే, అలాగే అక్రియావాదిని కూడా."

"నేను మనోవాక్కాయాలతో దుష్కర్మలు చేయకూడదు అని బోధిస్తాను. ఈ విధంగా నేను అక్రియావాదినే."

"నేను మనోవాక్కాయాలతో సత్కర్మలు చేయాలి అని బోధిస్తాను. ఈ అర్థంలో నేను క్రియావాదిని." అని చెప్పాడు.

కాబట్టి భగవానుని బోధనలో దుష్కర్మల పట్ల నిషేధాత్మకమైన, సత్కర్మల పట్ల విధేయాత్మకమైన బోధనలున్నాయి అనేది సుస్పష్టం.

## వారిత శీలము మరియు చారిత శీలము

ఆయన వారితము మరియు చారితము అనే రెండు రకాల శీలాలనూ బోధించేవారు. దుష్కర్మల నుండి విరతులు కావటాన్ని నేర్పించేవారు, అది వారిత శీలముగా; సత్కర్మలను ఆచరణలో పెట్టటాన్ని నేర్పించేవారు, అది చారిత శీలముగా పిలవబడేది. ఉదాహరణకు, జీవహింస "వారిత్త" మరియు మైత్రీ "చారిత్త" శీలము అవుతుంది. దొంగతనం "వారిత్త" మరియు దానము "చారిత్త" శీలము అవుతుంది. వ్యభిచరించటం "వారిత్త" మరియు బ్రహ్మచర్యం "చారిత్త" శీలము. కఠినపు మాటలు "వారిత్త" మరియు మృదుమాటలు "చారిత్త" శీలము. చెడు మాటలు "వారిత్త" మరియు మృదు మధుర పలుకులు "చారిత్త" శీలము. అనవసరపు మాటలు "వారిత్త" మరియు ధర్మచర్చ "చారిత్త" శీలము. అదే విధంగా ఇతర దుష్కర్మలన్నింటి నుండి విరతులు కావటం వారిత్త మరియు అన్ని సత్కర్మలను ఆచరణలో పెట్టటం చారిత శీలంగా పిలవబడేది. ఎలాగంటే

***"చారిత్తం అథ వారిత్తం, ఇరియాపథియం పసాదనియం ।***

***అధిచిత్తే చ ఆయోగో, ఏతం సమణస్స పతిరూపం॥"*** – థేరగాథా 591

–కుశల కర్మల ఆచరణ మరియు అకుశలాల నుండి విరమణ, ఉత్తమమైన నడవడిక మరియు సమాధిస్థితిలో ఉండే చిత్తం – ఇవే శ్రమణులకు అనుగుణమైనవి.

వారిత శీలమైనా, చారిత శీలమైనా, ధర్మమార్గంలో ముందుకు సాగటంలో ఏయే కర్మలు సహాయం చేస్తాయో, అవే సాధకునికి అనుకూల ధర్మాలు.

**సాధనలో "వారితము" యొక్క ప్రాముఖ్యత**

ఎవరైనా వ్యక్తి భగవానుని వ్యావహారిక విద్యను నేర్చుకోవటానికి విపశ్యన శిబిరంలో పాల్గొనాలంటే, ఆ వ్యక్తి పురాతన పరంపరను అనుసరిస్తూ మొదట పంచశీలాలను స్వీకరించి, శిబిర సమయంలో వాటిని శ్రద్ధగా పాటిస్తాడు. ఆ అయిదు శీలాలూ నిషేధాత్మకమైనవే. అవి –

1. పాణాతిపాతా వేరమణి 2. అదిన్నాదానా వేరమణి

3. అబ్రహ్మచరియా వేరమణి 4. మూసావాదా వేరమణి

5. సురా – మేరయ్య – మజ్జ – పమాదట్ఠానా వేరమణి సిక్ఖాపదం సమాధియామి.

అనగా, జీవహింస నుండి, దొంగతనం నుండి, మైథునం నుండి, అబద్ధాలు చెప్పటం నుండి మరియు మత్తు పదార్థాల సేవనం నుండి విరమించుకునే శిక్షణను స్వీకరిస్తున్నాను.

***సచిత్త పరియోదపనం*** చేసుకోవటమే విపశ్యన సాధన యొక్క అంతిమ ఉద్దేశ్యం. మన చిత్తాన్ని కేవలం పై పైననే కాకుండా, వేళ్ళతో సహా పరిపూర్ణంగా నిర్మలం చేసుకోవాలి. అందులో అణువంత మలినం కూడా మిగిలి ఉండకూడదు.

దాని పైన కొత్త కొత్త మలినాలను పేర్చుకుంటూ పోతే, అది పూర్తిగా ఎలా శుభ్రం కాగలదు? కాబట్టి ముందుగా కొత్త మలినం పేరుకోకుండా అదుపు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు, మంటలు చల్లార్చాలంటే దానిపైన కొత్తగా పెట్రోల్ చిలకరించటాన్ని, అంటే దానికి కొత్త ఇంధనం ఇవ్వటాన్ని ఆపివేయాల్సి ఉంటుంది. లేకపోతే చల్లార్చే పని నిరర్థకం, నిష్ఫలం అవుతుంది. అదేవిధంగా, ఒకవైపు చిత్తాన్ని నిర్మలం చేసుకోవటానికి పరిశ్రమ చేస్తూ, మరోవైపు అందులో కొత్త మలినాన్ని కూడా వేసుకుంటూ పోతే, చిత్తం ఎలా నిర్మలమవుతుంది?

చిత్తాన్ని కలుషితం చేసుకోకుండా మనం శరీరంతో, వాక్కుతో ఎటువంటి దుష్కర్మలూ చేయలేము. దుష్కర్మలు చేయటం ద్వారా కొత్త మలినాన్ని ప్రోగుచేసుకుంటూ ఉంటే, శుభ్రం చేసుకునే పని ఎలా జరుగుతుంది? కాబట్టి అక్కడ "వారిత్త" కు మొదటి ప్రాధాన్యతనివ్వటం ఎంతో అవసరం. శరీరముతో, వాక్కుతో చేసే దుష్కర్మల నుండి విరతుడిగా ఉంటూ చిత్తాన్ని శుభ్రం చేసుకునే పనిలో కార్యరతులైతే తప్పకుండా ఫలితం వస్తుంది.

భగవానుని బోధన అత్యంత వ్యావహారికమైనది మరియు తక్షణమే ఫలితాలనిస్తుంది కూడా. కాబట్టే వారిత మరియు చారిత రెండింటి పట్ల కూడా సరైన అవగాహనతో ముందుకుసాగాలి. భగవానుని బోధనలను కేవలం నిషేధాత్మకం అని చెప్పటం శుద్ధ తప్పు. ఈ భ్రమ నుండి బయటపడటంలోనే మన మేలు దాగి ఉంది.

– తరువాయి భాగం వచ్చే సంచికలో


**రెండు సంవత్సరాలకు చందా రూ 100/-** **విపశ్యన తెలుగు మాసపత్రిక** **జీవిత చందా రూ. 500/-**

**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** **వెల: రూ 5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**

12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,

HYDERABAD - 500 070.

Website : www.vri.dhamma.org

E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.